క్లుప్తంగా

ఐటీఐలో మిగులు సీట్లకు కౌన్సెలింగ్

సీతంపేట: ఐటీఐలో మిగులు సీట్లకు శనివారం కౌన్సెలింగ్ నిర్వహించారు. 333 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా... 178 మంది హాజరయ్యారు. వీరిలో 88 మందిని ఎంపిక చేసినట్లు ప్రిన్సిపాల్ గోపాలకృష్ణ తెలిపారు.

మండల సమావేశం రేపు

కురుపాం: మండల పరిషత్ సమావేశ భవనంలో ఈ నెల 29న ఎంపీపీ శెట్టి పద్మావతి అధ్యక్షతన మండల సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ అప్పారావు శనివారం తెలిపారు. ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే ఈ సమావేశానికి మండల పరిషత్ సభ్యులతో పాటు వివిధ శాఖల అధికారులు ఆయా శాఖలకు సంబంధించిన పూర్తి సమాచారంతో హాజరుకావాలని కోరారు.

దుకాణాల్లో తనిఖీలు


దుకాణాల్లో తనిఖీలు చేపడుతున్న సిబ్బంది

పాలకొండ: నగర పంచాయతీలోని పలు దుకాణాలను పంచాయతీ అధికారులు, సిబ్బంది శనివారం తనిఖీ చేశారు. పాలిథిన్ కవర్లు, కప్పులు విక్రయిస్తున్నదీ, లేనిదీ ఆరా తీశారు. కొంతమంది వ్యాపారుల నుంచి పాలిథిన్ ఉత్పత్తులను స్వాధీనం చేసుకుని హెచ్చరించారు. మారోసారి పట్టుబడితే కఠిన చర్యలు తప్పవన్నారు.

సందర్శన


విద్యార్థుల సామర్థ్యాన్ని అంచనా వేస్తున్న డిప్యూటీ ఈఓ నారాయుడు

సీతంపేట: మండలంలోని మల్లి గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ పాఠశాలను ఐటీడీఏ డిప్యూటీ ఈఓ పి.నారాయుడు శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థుల సామర్థ్యాన్ని అంచనా వేశారు. వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఉపాధ్యాయులకు సూచించారు. అనంతరం పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో హెచ్ఎం శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యావిధానాలపై చర్చ


విద్యా చట్టంపై చర్చిస్తున్న మోడల్ పాఠశాల విద్యార్థులు

భామిని: మండల కేంద్రంలోని ఏపీ మోడల్ స్కూల్‌లో శిక్షా సప్తాహ్ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులచే మంత్రుల వేషధారణలు వేయించి జాతీయ విద్యావిధానం - 2020 చట్టంపై శనివారం చర్చావేదిక నిర్వహించారు. విద్యార్థులు వివిధ రాష్ట్రాల మంత్రుల వేషధారణలతో చట్టం వల్ల కలిగే సౌలభ్యాలపై చర్చించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఆర్.శివకుమార్, వైస్ ప్రిన్సిపాల్ ఆర్. బాబూరావు, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఏజెన్సీలో ముమ్మరంగా తనిఖీలు


గుమ్మగదబవలస వంతెన వద్ద తనిఖీలు చేస్తున్న పోలీసు బలగాలు

కురుపాం: మావోయిస్టు వారోత్సవాల నేపథ్యంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు నిఘా పెంచారు. ఎల్విన్‌పేట సీఐ సత్యనారాయణ, కురుపాం ఎస్సై షణ్ముఖరావు ఆధ్వర్యంలో ప్రత్యేక పోలీసు బలగాలు, బాంబ్ డిస్పోజబుల్ బృందాలు శనివారం రస్తాకుంటుబాయి నుంచి ఎల్విన్‌పేట వరకు తనిఖీలు చేపట్టారు. దారిపొడవునా ఉన్న కల్వర్టులు, వంతెనల వద్ద క్షుణ్ణంగా తనిఖీలు చేశారు.

ప్రశాంతంగా రెండో విడత కౌన్సెలింగ్


కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న ప్రిన్సిపాల్ సునీల్‌కుమార్

గుమ్మలక్ష్మీపురం: మండల కేంద్రంలోని భద్రగిరి ప్రభుత్వ ఆర్ఐటీఐలో శనివారం చేపట్టిన రెండో విడత కౌన్సెలింగ్ ప్రశాంతంగా జరిగినట్లు ప్రిన్సిపాల్ సీహెచ్ సునీల్‌కుమార్ తెలిపారు. వివిధ ట్రేడుల్లో ఖాళీగా ఉన్న స్థానాల భర్తీ కోసం దరఖాస్తులు ఆహ్వానించగా 150 దరఖాస్తులు వచ్చాయని, ఈ కౌన్సిలింగ్ ద్వారా 74 సీట్లు భర్తీ అయినట్లు తెలిపారు.

మొక్కల పెంపకంపై శ్రద్ధ వహించాలి


పాలకొండ రూరల్: పాఠశాల ప్రాంగణంలో విద్యార్థులతో కలసి మొక్కలు నాటుతున్న ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు


వీరఘట్టం: కంబరవలస హైస్కూల్ ఆవరణలో మొక్కలు నాటుతున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

పాలకొండ రూరల్: పర్యావరణ పరిరక్షణలో భాగంగా విద్యార్థులు తమ పాఠశాలలు, ఇళ్ల వద్ద మొక్కలు పెంపకాన్ని అలవాటుగా చేసుకోవాలని సర్పంచ్ పి.శోభారాణి అన్నారు. మండలంలోని తుమరాడ ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల ప్రాంగణంలో విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో కలసి ఆమె మొక్కలు నాటారు. ఈ సందర్భంగా హెచ్ఎం ఎస్.ప్రవళిక మాట్లాడుతూ.. పచ్చని చెట్లతో పర్యావరణం మెరుగు పడుతుందని చెప్పారు.కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

అమ్మ పేరుతో మొక్కలు ..

వీరఘట్టం: మండలంలోని కంబరవలస జిల్లా పరిషత్ హైస్కూల్‌లో శిక్షా సప్తాహ్ కార్యక్రమంలో భాగంగా అమ్మ పేరుతో విద్యార్థులు, ఉపాధ్యాయులు పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. పర్యావరణ పరిరక్షణకు అందరూ మొక్కలు నాటాలని నినాదాలు చేశారు.

దోమల నివారణకు చర్యలు


దోమల నివారణ మందు పిచికారీ చేయిస్తున్న సర్పంచ్

గుమ్మలక్ష్మీపురం: గ్రామంలో దోమల నివారణకు ఏఎల్వో ద్రావణం పిచికారీ చేయిస్తున్నట్లు సర్పంచ్ బొత్తాడ గౌరీశంకరరావు తెలిపారు. మండల కేంద్రమైన గుమ్మలక్ష్మీపురంలోని పలు కాలనీల్లో ఉన్న మురుగునీటి కాలువల్లో శనివారం దోమల నివారణ మందు పిచికారీ చేశారు. గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రజలు సహకరించాలని కోరారు. పంచాయతీ కార్యదర్శి కిశోర్ ఉన్నారు.

సారాతో వ్యక్తి అరెస్ట్

కొమరాడ: మండలంలోని కోటిపాం సమీపంలో సారా విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఎస్సై నీలకంఠం తెలిపారు. గుమడ గ్రామానికి చెందిన రాజాన బాజీ సారా విక్రయిస్తుండగా అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద 10 లీటర్ల సారా ప్యాకెట్లు స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ఆదివాసీ దినోత్సవాన్ని జయప్రదం చేయండి


మాట్లాడుతున్న మొండెంఖల్ సర్పంచ్ ఇంటికుప్పల గౌరీశంకరరావు

కురుపాం: వచ్చే నెల 9న నిర్వహించే ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని జయప్రదం చేయాలని మాజీ ఎంపీపీ హిమరిక నీలకంఠేశ్వరరావు, వైస్ ఎంపీపీలు బిడ్డిక అన్నాజీరావు, రంగారావు, ఎంపీటీసీ విద్యారాణి, పలువురు సర్పంచ్‌లు పిలుపునిచ్చారు. శనివారం వారు మాట్లాడుతూ మండలంలోని నీలకంఠాపురం పంచాయతీలో ఆగస్టు 9న ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని గిరిజన సాంప్రదాయాలు, ఆచారాలు, కట్టుబాట్ల ప్రకారం నిర్వహించేందుకు నిర్ణయించామన్నారు. ఈ వేడుకల్లో గిరిజనులంతా పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో ఎంపీటీసీలు బిడ్డిక రాజేశ్వరి, ఏజేఏసీ బిడ్డిక రామారావు, కె.అప్పలస్వామి, కిల్లక గణపతి, టీఆర్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఇంటికుప్పల రామకృష్ణ, తాడంగి లోకనాథం, మొండెంఖల్, నీలకంఠాపురం, జరడ, ఉరిడి సర్పంచ్‌లు గౌరీశంకరరావు, మన్మథరావు, తదితరులు పాల్గొన్నారు.

పాలిటెక్నిక్‌లో స్పాట్ అడ్మిషన్లు రేపు

జియ్యమ్మవలస: మండలంలోని చినమేరంగి ఎస్ఎస్ఎస్‌డీ పాలిటెక్నిక్ కళాశాలలో సోమవారం స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ జి.నరేష్‌బాబు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 10వ తరగతి ఉత్తీర్ణత సాధించి, పాలిసెట్‌లో అర్హత సాధించకపోయినా స్పాట్ అడ్మిషన్లకు అర్హులు అని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఈనెల 29లోగా తమ దరఖాస్తుతో పాటు 2024 పాలిసెట్ హాల్ టికెట్, ర్యాంకు కార్డు, 10వ తరగతి మార్కుల జాబితా, టీసీ, 4-10వ తరగతి వరకు స్టడీ సర్టిఫికెట్, కులధ్రువీకరణ పత్రం అందివ్వాలన్నారు. పాలిసెట్‌లో అర్హత సాధించిన బీసీ, ఓసీ అభ్యర్థులు ప్రాసెసింగ్ ఫీజుగా రూ.700, పాలిసెట్‌లో అర్హత సాధించని వారు రూ.1100 చెల్లించాల్సి ఉంటుందన్నారు. సీటు సాధించిన వారు కళాశాలలోనే రూ.4700 చెల్లించాలన్నారు. స్పాట్ అడ్మిషన్లకు వచ్చే విద్యార్థులు ఒరిజనల్ ధ్రువపత్రాలతో పాటు మూడు సెట్ల జిరాక్స్ కాపీలు తీసుకొని రావాలని సూచించారు. డిప్లమా ఇన్ మెకానికల్ ఇంజినీరింగ్, సివిల్ ఇంజినీరింగ్, ఈఈఈ కోర్సుల్లో సీట్లు ఖాళీగా ఉన్నాయన్నారు.

సిబ్బంది సహకరించారు..


తహసీల్దార్ జయప్రకాష్‌ను సత్కరిస్తున్న రెవెన్యూ ఉద్యోగులు

వీరఘట్టం: ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో వీరఘట్టం రెవెన్యూ ఉద్యోగులు తనకు మంచి సహకారం అందించారని తహసీల్దార్ కె.జయప్రకాష్ అన్నారు. ఆరు నెలల కిందట ఎన్నికల విధుల కోసం వీరఘట్టం వచ్చిన తహసీల్దార్ జయప్రకాష్ శనివారం తన విధుల నుంచి రిలీవయ్యారు. ఈ సందర్భంగా ఆయన్ను స్థానిక రెవెన్యూ ఉద్యోగులు సత్కరించి, వీడ్కోలు పలికారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ చందక సత్యనారాయణ, మండల సర్వేయర్ శ్రీనివాసరావు, ఆర్ఐ కె.లక్ష్మున్నాయుడు, వీఆర్ఓల సంఘ జిల్లా అధ్యక్షుడు ఎం.సింహాచలం, వీఆర్ఓలు, కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.

నేడు కళాకారుల సమావేశం

గరుగుబిల్లి: తోటపల్లి జట్టు సూతన ట్రస్ట్ కార్యాలయంలో ఆదివారం రాష్ట్ర కళాకారుల సంక్షేమ సంఘ కార్యవర్గ సమావేశం నిర్వహిస్తున్నట్లు ఆ సంఘ అధ్యక్షుడు ద్వారపురెడ్డి ధనుంజయరావు శనివారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళాకారులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లేందుకు సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కళాకారులంతా సమావేశానికి హాజరు కావాలని ఆయన కోరారు.

తహసీల్దార్‌కు సత్కారం


తహసీల్దార్ జయికు వీణను బహూకరిస్తున్న హెచ్‌డీటీ లక్ష్మీకుమార్


గరుగుబిల్లి: మండల తహసీల్దార్ కె.జయకు విశాఖపట్నం బదిలీ అయింది. స్థానిక కార్యాలయంలో సిబ్బంది శనివారం ఆమెను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. విధులు సక్రమంగా నిర్వహించేందుకు సహకరించిన రెవెన్యూ సిబ్బంది, ప్రజలు, ప్రజాప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు. డిప్యూటీ తహసీల్దార్ పి.సత్యలక్ష్మీకుమార్, ఆర్ఐ ఎస్.కృష్ణ, సీనియర్ సహాయకులు రమేష్‌తో పాటు పలువురు వీఆర్ఓలు తహసీల్దార్ జయను సత్కరించి బొబ్బిలి వీణను బహూకరించారు.

చురుగ్గా శానిటేషన్ పనులు

గరుగుబిల్లి: మండలంలోని పెద్దూరు గ్రామంలో పారిశుద్ధ్య పనులు చురుగ్గా చేపడుతున్నట్లు ఉప సర్పంచ్ తెర్లి ఎల్లంనాయుడు తెలిపారు. గ్రామంలోని కాలువల్లో పేరుకుపోయిన పూడికలు తొలగించి బ్లీచింగ్ వేయించారు. అలాగే తాగునీటి బోర్లు, రక్షిత పథకాల పరిసరాలను శుభ్రం చేయించి క్లోరినేషన్ చేపట్టారు. గ్రామంలోని పలు వీధుల్లో మరమ్మతులకు గురైన విద్యుత్ వీధిదీపాల స్థానంలో కొత్తవాటిని ఏర్పాటు చేశారు.

న్యాయ సహకారాన్ని సద్వినియోగం చేసుకోండి

- న్యాయమూర్తి విజయ్‌రాజ్‌కుమార్


సబ్‌జైల్‌లో ఖైదీలకు సూచనలు చేస్తున్న న్యామూర్తి విజయ్‌రాజ్‌కుమార్

పాలకొండ రూరల్ : సొంతంగా న్యాయవాదులను ఏర్పాటు చేసుకోలేని రిమాండ్ ఖైదీలు ప్రభుత్వం అందించే న్యాయ సహకారాన్ని సద్వినియోగం చేసుకోవాలని స్థానిక జూనియర్ సివిల్ కోర్టు న్యాయమూర్తి ఎ.విజయ్‌రాజ్‌కుమార్ అన్నారు. శనివారం స్థానిక సబ్‌జైల్‌లో న్యాయ విజ్ఞాన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఖైదీలకు న్యాయ శాస్త్రం ద్వారా అందించదగిన అంశాలపై అవగాహన కల్పించారు. క్షణికావేశాలు, ఇతర కారణాలతో కేసుల్లో చిక్కుకుని రిమాండ్‌కు వచ్చిన వారు కృంగిపోకుండా, నేరపూరిత భావన విడనాడి మంచిగా జీవనం సాగించాలని ఆకాంక్షించారు. అనంతరం ఖైదీలకు అందుతున్న వసతులపై జైల్ సూపరింటెండెంట్ బి.జోగులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు మరిచర్ల జగన్‌మోహనరావు, న్యాయస్థానం సిబ్బంది ఉన్నారు.

నేడు వాహనాల వేలం

గరుగుబిల్లి: మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో ఆదివారం వివిధ కేసుల్లో సీజ్ చేసిన రెండు ఆటోలు, ఐదు మోటార్ సైకిళ్లను వేలం వేయనున్నట్లు ఎస్ఐ వై.అప్పన్నరావు శనివారం తెలిపారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు వాహనాలను వేలం వేయనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న వారు తమ ఆధార్ కార్డుతో ఉదయం 9 గంటలకు హాజరు కావాలని కోరారు.

తహసీల్దార్ కార్యాలయంలో ఆధార్ సెంటర్


కొత్తగా ఏర్పాటు చేసిన ఆధార్ సెంటర్

వీరఘట్టం: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఆధార్ కేంద్రాన్ని తహసీల్దార్ కె.జయప్రకాష్ శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మండల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యాలయ పనివేళలతో పాటు ఆదివారం కూడా ఆధార్ సెంటర్ సేవలు ప్రజలకు అందుబాటులో ఉంటాయన్నారు.

స్థల పరిశీలన


స్థల పరిశీలన చేస్తున్న సర్వేయర్ల బృందం

పాలకొండ: నగర పంచాయతీకి సంబంధించి డంపింగ్‌యార్డు నిర్మాణానికి అధికారులు పలు ప్రాంతాల్లో శనివారం స్థల పరిశీలన చేపట్టారు. నగర పంచాయతీ కమిషనర్ సర్వేశ్వరరావు, మండల సర్వేయర్ వెంకటరావు ఆధ్వర్యంలో రెవెన్యూ బృందం మండలంలోని వెలగవాడ పంచాయతీ పరిధిలోని సిరికొండ ప్రాంతంలో స్థలం పరిశీలించారు. గతంలో ఇక్కడ స్థలం ఎంపిక చేయగా అక్కడి గిరిజనుల నుంచి అభ్యంతరం వ్యక్తం కావడంతో ఆ ప్రతిపాదన నిలిచిపోయింది. ప్రస్తుతం మరోమారు అధికారులు స్థలం కోసం ప్రయత్నాలు చేస్తున్నారు. విజయరామపురం సమీపంలో ప్రభుత్వ భూములు ఉన్న నేపథ్యంలో ఆ ప్రాంతంలో పరిశీలన చేశారు. ప్రస్తుతం నగర పంచాయతీకి డంపింగ్ యార్డు లేకపోవడంతో చెత్తను వేయడానికి ఇబ్బందులు పడుతున్నారు.

ఆడపిల్లలకు అండగా ఉండాలి..


ఎం.సింగుపురంలో పోస్టర్లు ప్రదర్శిస్తున్న ఐసీడీఎస్ అధికారులు, ఉపాధ్యాయులు

పాలకొండ రూరల్: ఆడ పిల్లలకు ప్రతిఒక్కరూ అండగా ఉండాలని, వారిని ఉన్నత స్థానాలకు చేర్చే క్రమంలో తోడ్పాటు అందించాలని సీడీపీఓ బి.సిమ్మాలమ్మ అన్నారు. బేటీ బచావో బేటీ పఢావో కార్యక్రమంలో భాగంగా ఎం.సింగుపురం, సీఎం.పురం, పెద్దకాపువీధి సెక్టార్ల పరిధిలో శనివారం వివిధ రకాల అవగాహన కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయా ప్రాంతాల్లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల బాలికలతో ర్యాలీలు నిర్వహించారు. బాల్యవివాహాల వల్ల కలిగే అనర్థాలు,బాలికల అక్రమ రవాణ, లైంగిక దాడుల నుంచి రక్షణ పొందు విధానాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆయా పాఠశాల హెచ్ఎంలు సోమేశ్వరరావు, జామి రవి, సూపర్‌వైజర్లు పి.దశారత్నం, మేరీ, అంగన్‌వాడీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులను సకాలంలో గుర్తించాలి


జ్వరాలపై ఆరా తీస్తున్న జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ప్రోగ్రాం అధికారి జగన్మోహనరావు

కురుపాం: సీజనల్ వ్యాధులను సకాలంలో గుర్తించాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ప్రోగ్రాం అధికారులు డా. టి.జగన్మోహనరావు, డా. పి.ఎల్.రఘుకుమార్ వైద్య సిబ్బందిని ఆదేశించారు. మండలంలోని డి.కీడవాయి, రాముడుగూడ, గుంజరాడ గ్రామాల్లో జ్వరాలతో బాధపడుతున్న పలువురి ఇళ్లను శనివారం సందర్శించారు. మలేరియా వ్యాధి గ్రస్తులకు అందిస్తున్న చికిత్స, మందులను పరిశీలించారు. వైద్యులు సూచించిన విధంగా మందులు వేసుకోవాలని, కాచి చల్లార్చిన నీటిని తాగాలని, ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలని సూచించారు. సీజనల్ వ్యాధులపై క్షేత్రస్థాయి ఆరోగ్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. అనంతరం ధర్మలక్ష్మీపురం గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో విద్యార్థుల ఆరోగ్యంపై ఆరాతీశారు. మొండెంఖల్ పీహెచ్‌సీ వైద్యాధికారి డా.బి.ప్రజ్ఞ, డా.అభినవ్, డా.అమర సింహారెడ్డి, సూపర్‌వైజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ


వాహనాలు తనిఖీ చేస్తున్న ఎస్సై నీలకంఠం

కొమరాడ: వాహన చోదకులు లైసెన్స్, సరైన ధ్రువపత్రాలు లేకుండా వాహనాలు నడిపితే కేసులు నమోదు చేస్తామని ఎస్సై నీలకంఠం హెచ్చరించారు. స్థానిక జూనియర్ కళాశాల సమీపంలో శనివారం వాహన తనిఖీలు చేపట్టారు. గంజాయి, మద్యం, నిషేధిత పదార్థాల రవాణాపై నిఘా పెట్టినట్లు చెప్పారు. ఒడిశా నుంచి వస్తున్న వాహనాలను క్షుణ్ణంగా తనిఖీలు చేస్తున్నట్లు తెలిపారు. నిషేధిత పదార్థాలు తరలించినా, మద్యం సేవించి వాహనాలు నడిపినా కఠిన చర్యలు తప్పవన్నారు. వాహనచోదకులు తమ వెంట వాహన సంబంధిత ధ్రువపత్రాలు ఉంచుకోవాలని సూచించారు.

రోడ్డు భద్రత నియమాలపై అవగాహన


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎంవీఐ సత్యనారాయణ

జియ్యమ్మవలస: చినమేరంగి ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు రోడ్డు భద్రత నియమాలపై మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ శనివారం అవగాహన కల్పించారు. వాహనాలు నడిపేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పాటించాల్సిన నిబంధనలను వివరించారు. మద్యం తాగి వాహనం నడపడం, ఓవర్ స్పీడ్, ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయడం వల్ల కలిగే ప్రమాదాలపై పూర్తి అవగాహన కల్పించారు. సీట్‌బెల్ట్, హెల్మెట్ ధరించడం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.రమణ, డాక్టర్ పి.మోహనరావు, అధ్యాపకులు వీకేజీ మహరాజా, శివప్రసాద్, రాధాకృష్ణ ఉన్నారు.

పింఛన్ల పంపిణీ సక్రమంగా చేపట్టాలి


మాట్లాడుతున్న ఎంపీడీఓ సూర్యనారాయణ

గరుగుబిల్లి: ప్రతీ నెల పంపిణీ చేసే సామాజిక పింఛన్లను సక్రమంగా అందజేయాలని ఎంపీడీఓ పి.సూర్యనారాయణ కార్యదర్శులకు సూచించారు. తన కార్యాలయంలో శనివారం కార్యదర్శులు, వెల్ఫేర్ అసిస్టెంట్లు, డిజిటల్ అసిస్టెంట్లతో సమావేశాన్ని నిర్వహించారు. ఆగస్టు 1న ఉదయం 6 గంటల నుంచే పింఛన్లను లబ్ధిదారులకు అందించాలన్నారు. పింఛన్ల పంపిణీపై ముందుగా గ్రామంలో దండోరా వేయించాలన్నారు. నిర్లక్ష్యంగా వ్యవహరించే సిబ్బందిపై చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. అలాగే గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు చేపట్టాలని, పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు.

ఎస్ సొసైటీ ప్రతినిధుల సేవాభావం


మొక్కలు నాటుతున్న ఎంఈఓ, సొసైటీ సభ్యులు

కురుపాం: ఎస్ సొసైటీ సేవలను ప్రతీ ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని ఎంఈఓ ఎస్.సత్యనారాయణ అన్నారు. ఎస్.సొసైటీ రెండవ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మండల కేంద్రంలోని శివ్వన్నపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు శనివారం నోట్‌బుక్స్, పోషకాహారం పంపిణీ చేశారు. అనంతరం పాఠశాల ఆవరణంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్ సొసైటీ ప్రతినిధులను ఎంఈఓ సత్యనారాయణ అభినందించారు. కార్యక్రమంలో సొసైటీ కార్యదర్శి షేక్ గౌస్ సాహెబ్, ఉపాధ్యాయులు ఎస్.గౌరీశంకర్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్యసేవలు అందించాలి

సీతంపేట: గిరిజనులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని ఐటీడీఏ పీఓ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి అన్నారు. దోనుబాయి పీహెచ్‌సీని శనివారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా వైద్యసిబ్బందితో మాట్లాడుతూ.. ఓపీ, మందుల వివరాలు, రోగులకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. అనంతరం నాయకమ్మగూడ గ్రామాన్ని సందర్శించారు. గ్రామంలో మూసి ఉన్న స్కూల్‌ను తెరిపించాలని గ్రామస్తులు కోరగా.. పాఠశాలను పునఃప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటామని పీఓ హామీ ఇచ్చారు. అలాగే చాపరాయిగూడ గ్రామ రహదారిని కూడా పరిశీలించారు.

బాల్యవివాహాలు చట్టరీత్యా నేరం


ర్యాలీ నిర్వహిస్తున్న సీడీపీఓ అరుణకుమారి, తదితరులు

- సీడీపీఓ జి.అరుణ్‌కుమారి

కొమరాడ: బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని సీడీపీఓ జి.అరుణకుమారి అన్నారు. కొమరాడ కేజీబీవీలో శనివారం 'బేటీ బచావో బేటీ పఢావో' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో తల్లిదండ్రులు బాలికలను చదువు మాన్పించి వివాహాలు చేస్తున్నారని, దీని వల్ల బాలికల్లో ఆరోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందన్నారు. కిశోర బాలికల సంరక్షణకు ప్రభుత్వాలు చర్యలు తీసుకుంటున్నాయని అన్నారు. పౌష్టికాహారం అందించడంతో పాటు వారి రక్షణకు అనేక చట్టాలు తీసుకొచ్చాయన్నారు. బాలికలపై లైంగిక వేధింపులకు పాల్పడేవారిపై కఠిన చర్యలు ఉంటాయన్నారు. అనంతరం గ్రామంలో అవగాహన ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ ఎ.రాధాకృష్ణ, పిన్సిపాల్ జి.అరుణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అనధికార సభ్యుల హడావిడే ఎక్కువ...

- మండల సర్వసభ్య సమావేశంలో పలు అంశాలపై చర్చ


మండల సమావేశంలో పాల్గొన్న అధికారులు, సభ్యులు

భామిని: ఎంపీపీ తోట శాంతికుమారి అధ్యక్షతన, ఎంపీడీఓ కొవ్వాడ కిశోర్‌కుమార్ పర్యవేక్షణలో శనివారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో అనధికార సభ్యుల హడావిడే ఎక్కువగా కనిపించింది. సభ్యులకు బదులు వారి ప్రతినిధులు ఎక్కువగా హాజరై మండల పరిషత్ నిధుల వినియోగంపై రాద్ధాంతం చేశారు. మణిగ, బొడ్డగూడ, భామిని గ్రామాల సమస్యలకు నిధులు కేటాయించలేదని ప్రశ్నించారు. దీంతో కార్యక్రమానికి ప్రత్యేక ఆహ్వానితులుగా హాజరైన తోట సింహాచలం, సర్పంచ్‌ల సంఘ అధ్యక్షుడు మజ్జి మోహన్‌బాబు కలుగజేసుకుని అవసరాల మేరకు అన్ని గ్రామాలకు నిధులు కేటాయించామని తెలియజేయడంతో సభ్యులు శాంతించారు. రైతులకు ఎరువుల కొరత రాకుండా చూడాలని చిన్నదిమిలి, సతివాడ సర్పంచ్‌లు రవికుమార్, రామారావు కోరారు. ఉపాధి పథకం ద్వారా మండలానికి 24 గోశాలలు మంజూరయ్యాయని ఏపీఓ తులసీదాస్ తెలిపారు. అనంతరం వీధిలైట్లు, విద్యుత్ లైన్ల నిర్వహణ, గృహనిర్మాణాలకు సంబంధించిన బిల్లుల మంజూరుపై చర్చించారు. కార్యక్రమంలో ఏఓ సింహాచలం, ఏఈ చంద్రశేఖర్, వైస్ ఎంపీపీ బి.ధర్మారావు, ఎంపీటీసీ సభ్యులు కె.చంద్రశేఖర్, పి.ఉషారాణి, పాలక మురళీ, పి.రాంబాబు, సర్పంచ్‌లు, అధికారులు పాల్గొన్నారు.